క్లుప్తంగా

మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు

మహారాణిపేట: ప్రభుత్వ, ప్రైవేటు ట్రైనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (మహిళ) కోర్సులో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, దరఖాస్తులు సమర్పించడానికి సెప్టెంబర్ 30 చివరి తేదీ అని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు https://cfw.ap.nic.in/ను సందర్శించాలని సూచించారు.

దిశ సమావేశానికి పూర్తి వివరాలతో హాజరు కావాలి

మహారాణిపేట: కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధ్యక్షతన జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం (దిశ) సమావేశం శుక్రవారం జరిగింది. పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏప్రిల్ 17న తీసుకున్న నిర్ణయాలను ఎంత వరకు అమలు చేశారు, తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరిగే దిశ సమావేశానికి పూర్తి వివరాలతో హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌వో డాక్టర్ భవానీ శంకర్, జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి పాల్గొన్నారు.

అభాగ్యుడికి ఆశ్రయం



సురేష్‌ను షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయికి అప్పగిస్తున్న వెంకటేశ్వరరావు

అల్లిపురం: రోడ్డుపై కదలేని పరిస్థితిలో ఉన్న అభాగ్యునికి జీవీఎంసీ ఏయుటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. డైమండ్ పార్కు వద్ద కదలలేని స్థితిలో ఉన్న సురేష్ అనే వ్యక్తిని, అటుగా వెళ్తున్న ఎండాడ మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ భీశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం చూసి, అతని వివరాలు తెలుసుకున్నాడు. అతడి కాలు పురుగులు పట్టి ఉండటంతో అతని వివరాలను తీసుకుని, ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్ రమేష్ ఆ వ్యక్తిని జీవీఎంసీ టీఎస్సార్ నిరాశ్రయ వసతిగృహానికి తీసుకువెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అతడికి నయం కాగానే తిరిగి షెల్టర్‌లో ఆశ్రయం కల్పిస్తామని వారు తెలిపారు.

నిరాశ్రయుడికి అంత్యక్రియలు


అప్పారావు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: ఏయూటీడీ సిబ్బంది నెల రోజుల క్రితం డే ఫీల్డ్ విజిట్స్‌లో రక్షించిన వ్యక్తి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందడంతో, అంతిమ సంస్కారాలు నిర్వహించారు. షెల్టర్ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపిన వివరాలివి.. ఆనందపురానికి చెందిన అలభాని అప్పారావు (65)కు జూలై 21న టీఎస్సార్ కాంప్లెక్స్ నిరాశ్రయ వసతి గృహంలో వసతి కల్పించారు. అప్పారావు కొద్ది రోజులుగా ఆహారం సహించక, తిన లేక ఇబ్బంది పడుతున్నాడు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఏయూటీడీ సెక్రటరీ ప్రగడ వాసు, సిబ్బంది జ్ఞానపురం శ్మశానవాటికలో అతడి అంత్యక్రియలు నిర్వహించారు.

అభిమానుల సందడి


చిరంజీవి జన్మదిన వేడుకల్లో అభిమానులు

అల్లిపురం: సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు శుక్రవారం వెంకటేశ్వరమెట్టపై ఘనంగా నిర్వహించారు. చంటి బాయ్స్ ఆధ్వర్యంలో జీకే ఫౌండేషన్ చైర్మన్ భీశెట్టి గోపికృష్ణ కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా అభిమానులు చిరంజీవికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి, ఆటపాటలతో సందడిగా గడిపారు.

శిరస్త్రాణం.. రక్షణ కవచం


హెల్మెట్ ధరించకుండా బైక్ డ్రైవ్‌చేస్తున్న వ్యక్తి ఫొటో తీస్తున్న ట్రాఫిక్ సిబ్బంది


హెల్మెట్ కేసులు నమోదు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు


వాహన చోదకుడి శిరస్సుపై హెల్మెట్ పెడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ విశ్వనాథం


వివిధ రకాల హెల్మెట్‌లు

- ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి
- ప్రయాణంలో ప్రమాదాల నుంచి భద్రత
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ: హెల్మెట్ లేని ప్రయాణం.. అత్యంత ప్రమాదకరం. రోడ్డు ప్రమాదం సంభవించి ఒక ప్రాణం కోల్పోతే ఆ కుటుంబంలో తీరని బాధను మిగిలుస్తుంది. ఏ కుటుంబ ఇటువంటి క్షోభను అనుభవించకూడదని ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహన చోదకులకు శిరస్త్రాణం ఎంత అవసరమో తెలియజేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు, రోడ్డు ప్రమాదంలో రక్షణ కవచంలా నిలిచేందుకు హెల్మెట్ ధారణ తప్పనిసరి అనడంతోపాటు వారి హెల్మెట్‌కు 'క్లిప్' తప్పనిసరి అంటూ పోలీసులు కొత్త ఆలోచన సత్ఫలితాలు ఇస్తున్నాయి. హెల్మెట్ అందరూ పెడుతుంటారు.. కొందరు తప్పక పెడతారు.. మరికొందరు హెల్మెట్ పెట్టినా.. కిందన క్లిప్ పెట్టకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు కిందపడగానే హెల్మెట్ కూడా పక్కకు పడిపోవడం, దాని వల్ల తలకు తీవ్రమైన గాయాలవడం వంటివి జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు క్లిప్ పెట్టుకోవడం బాధ్యతగా తీసుకుని వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఒకపక్క చలానాలు.. మరోపక్క అవగాహనలు

ట్రాఫిక్ నిబంధనలు మీరిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ఒకపక్క చలానాలు రాస్తూ విధులు నిర్వహిస్తూనే.. మరోపక్క హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైతే హెల్మెట్ పెట్టుకుని కూడా గెడ్డం వద్ద క్లిప్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేస్తున్నారో.. అటువంటి చోదకుల వాహనం ఆపి హెల్మెట్ క్లిప్ పెట్టి పంపిస్తున్నారు. అదే సమయంలో వచ్చే వాహన చోదకులకు అవగాహన కింద క్లిప్ పెడుతూ ఆపై కుటుంబ బాధ్యత, సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వివరిస్తూ ప్రమాదాలను అరికడుతున్నారు.

యువత కీలకం..

కుటుంబ బాధ్యత తీసుకుంటారనుకున్న కొడుకులా బైక్‌లు అతివేగంగా నడిపి ప్రాణాలు కోల్పోతుండటంతో తల్లిదండ్రులు ఆశలు ఆవిరవుతున్నాయి. ద్విచక్ర వాహనాలను మితిమీరిన వేగంతో నడిపే యువకుల్లో మార్పు అనివార్యమని ట్రాఫిక్ అధికారులు అంటున్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించి, వాటి సంఖ్యను తగ్గించేందుకు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తీసుకుంటున్న చర్యల్లో యువతే కీలకంగా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. రైడ్‌లు పెట్టుకోవడం, మత్తు పదార్థాలు తీసుకోవడం, మద్యం తాగడం, జిగ్‌జాగ్‌లా నడపడం వల్ల ఇతర వాహనాలు ప్రమాదాల బారిన పడతాయని, ర్యాష్ డ్రైవింగ్ మానుకోవాలని సూచిస్తున్నారు. మద్యం తాగి, హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే అపరాధ రుసుంతోపాటు కఠిన చర్యలు తప్పక తీసుకుంటామని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం సాగించాలని కోరుతున్నారు.

కుటుంబాన్ని గుర్తుపెట్టుకోండి

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులను గుర్తుపెట్టుకోవాలి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో తెలియదు. మనల్ని మనం కాపాడుకుంటూ కుటుంబ బాధ్యతలు నెరవేర్చడానికి విధిగా హెల్మెట్ ధరించాలి. జుట్టు కంటే ప్రాణం మిన్నని తెలుసుకుని తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకుని సురక్షిత ప్రయాణం సాగించండి.

– షణ్ముఖరావు, ట్రాఫిక్ సీఐ, వన్ టౌన్

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్ నివారించవచ్చు


క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: నేషనల్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా మహిళలందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ముఖ్య అతిథి హాజరై మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన మహిళల ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం ద్వారా ప్రారంభ దశలోనే క్యాన్సర్ కేసులను గుర్తించవచ్చన్నారు. ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ రాధాకుమారి, మెడికల్ ఆంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శిల్పా, నోడల్ పర్సన్ డాక్టర్ సాయిసుష్మ, డాక్టర్ కిరణ్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరికా తదితరులు పాల్గొన్నారు.

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటుకు వినతి


ఆర్టీసీ ఆర్‌ఎం నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సంజీవరావు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో విద్యాసంస్థలు అధికంగా ఉన్నందున, విద్యార్థులు, అధ్యాపకులకు అనువుగా బస్టాప్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడును జ్ఞానాపురానికి చెందిన 'సదా మీ సేవలో' ట్రస్ట్ వ్యవస్థాపకుడు వంకా సంజీవరావు కోరారు. శుక్రవారం ఆయనను కలిసి, ప్రజల సంతకాలతో కూడిన వినతిపత్రం అందించారు. జ్ఞానాపురంలో జూబ్లీ, సెయింట్ మేరీస్, సోఫియా జూనియర్ కళాశాల వంటి విద్యాసంస్థల విద్యార్థులు, అధ్యాపకులు, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీకి చెందిన ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తూంటారని తెలిపారు. ఇటు కంచరపాలెం నేతాజీ కూడలి, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్, కాన్వెంటుకూడలి ప్రాంతాల్లో బస్టాప్‌లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడి విద్యార్థులు, ప్రజలు, ఉద్యోగులకు సరైన బస్టాప్ లేక కిలోమీటర్ దూరం నడుచుకు వెళ్లే పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

శ్రీ మహాలక్ష్మీ నమోస్తుతే


టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో పూలు, పండ్లతో విశేష అలంకరణలో ఉమాదేవి


పుష్పాలంకరణలో సాగరగిరి కనకదుర్గమ్మ

- అమ్మవారిని స్తుతించిన మహిళలు
- వైభవంగా శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం పూజలు

అల్లిపురం: నమస్తేస్తు మహామాయే.. శ్రీపీఠే సుర పూజితే..శంఖచక్ర గదాహస్తే.. మహాలక్ష్మీ నమోస్తుతే అంటూ మహిళలు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో స్తుతించారు. శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ పరిధిలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజించారు. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో కొలువుదీరిన ఉమాదేవి అమ్మవారిని పూలు, పండ్లు, పత్రితో ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించారు. విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు.

- నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఆలయ అర్చకుడు జోగారావు శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.
- అల్లిపురం శ్రీ అలమేలుమంగమ్మ ఆలయం, మూడుగుళ్లు కనకదుర్గమ్మ ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని శ్రీ రేణుక యల్లమ్మ వారి దేవాలయం, జెండాచెట్టువీధి విజయదుర్గాలమ్మ, యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ ఆలయాల్లో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు.

'సెవెన్‌హిల్స్'లో వాటర్ వేపర్ థెరపీ ప్రారంభం


మాట్లాడుతున్న ఎంజీఎం హెల్త్‌కేర్ క్లస్టర్-2 హెడ్ పద్మనాభన్

మహారాణిపేట: బినైన్ ప్రోస్టాటిక్ హైపర్‌ప్లాసియా (బీపీహెచ్) అనే వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వాటర్ వేపర్ థెరపీ చికిత్సను శుక్రవారం ప్రారంభించింది. సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంజీఎం హెల్త్‌కేర్ క్లస్టర్-2 హెడ్ పద్మనాభన్ వివరాలు వెల్లడించారు. బీపీహెచ్ వ్యాధి వల్ల 50 ఏళ్ల వయసు దాటిన పురుషుల్లో మూత్ర విసర్జనలో ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రోస్టేట్ గ్రంథి పెరుగుతుందని, ఇది క్యాన్సర్ కాదని, దేశంలో 28.1 మిలియన్ల మంది పురుషులు ఈ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రోస్టేట్ పెరిగిన సమయంలో మూత్ర విసర్జన కష్టంగా ఉంటుందని, వాటర్ వేపర్ థెరపీ ద్వారా ఆవిరి రూపంలో ఉన్న నీటి సహజ శక్తిని ఉపయోగించి అదనపు ప్రోస్టేట్ కణజాలాన్ని చిన్నదిగా చేస్తారని వివరించారు. ప్రతి చికిత్స కేవలం 9 సెకన్ల పాటు మాత్రమే జరుగుతుందన్నారు. ప్రపంచ ప్రమాణాల్లో ఉన్న వాటర్ వేపర్ థెరపీని విశాఖలో ప్రారంభించామని, ఉత్తర ఏపీలో ఎంజీఎం సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో తొలిసారిగా అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. సమావేశంలో యూనిట్ సీవోవో డాక్టర్ గిరిబాబు నాదేళ్ల, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాఘవేంద్ర, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిశంకర్, యూరాలజిస్ట్ డాక్టర్ రవికుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం


బంగారుమెట్టలో నివాసులకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న రమేష్ తదితరులు


వాడ వీధిలో ప్రచారం చేస్తున్న వార్డు అధ్యక్షుడు ముజిబ్‌ఖాన్ తదితరులు


కల్లుపాకలు ప్రాంతంలో ప్రచారం చేస్తున్న వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో వార్డుల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 33వ వార్డులోని బంగారుమెట్టు కాలనీ 62 బూత్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం ప్రజలను ఏవిధంగా మోసం చేస్తుందో వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పచ్చరిపల్లి రాము, మహిళా నాయకులు సలాది భాను, లక్ష్మీకాంతం, చంద్రకళ, శిరీష, బుర్లి చిన్న, పీవీఎస్ రెడ్డి, ధర్మ, చోడిపల్లి శివకుమార్, బి.రెడ్డి, కనిగిని సంతోష్‌కుమార్, సత్య, అప్పయ్యమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 88వ బూత్ కల్లుపాకలు ప్రాంతంలో కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణు రెడ్డి, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, నగేష్, దుర్గాప్రసాద్, పి.రమణమ్మ, వై.రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

39వ వార్డులో..

జీవీఎంసీ 39వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ముజిబ్‌ఖాన్ అధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై ఇంటింటా ప్రచారం చేశారు. వాడ వీధిలో కార్యకర్తలతో కలిసి చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీల గురించి ప్రజలకు వివరించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని ముజిబ్‌ఖాన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముహ్మద్ యాసీన్ బాబ్జి, కురుపం మార్కెట్ చైర్మన్ కృష్ణ, సత్య, షిలార్, రాజేష్, మాధురి, ధనరాజ్, ప్రసాద్, నూకరత్నం, సలీం, ఇబ్రహీం, వెంకటి, బుజ్జి, ఈశ్వరి, అప్పలరాజు, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. పెరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, సీపీ బాగ్చి సంయుక్తంగా ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా నగర పోలీస్ కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యత, కస్టమర్ల రక్షణ ప్రాముఖ్యతపై చర్చించారు. మోసపూరిత లావాదేవీలు, 'గోల్డెన్ అవర్'పై ఇరు శాఖలు తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, వారికి సరైన మార్గదర్శకత్వం ఇచ్చేందుకు సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వడంపై చర్చించారు. సైబర్ క్రైమ్ నివారణలో ఇరుశాఖలు చర్చించి, కార్యాచరణ సిద్ధం చేశారు. సమావేశంలో డీసీపీ-1 అజిత వెజెండ్ల, డీసీపీ-2 మేరీ ప్రశాంతి, అడ్మిన్ డీసీపీ కృష్ణకాంత్ పటేల్, సింగల సుబ్బయ్య, బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ కల్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ అంబుడ్స్‌మన్ బాల తేజ సుబ్బారు, బ్యాంకింగ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ-లీగల్: వచ్చే నెల 13న జరగనున్న లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు సహకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కోర్టు ఆవరణలో శుక్రవారం బ్యాంకు ప్రతినిధులు, చిట్ ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాజీకి అవకాశమున్న కేసులను గుర్తించి, కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, బీమా సంస్థల చిట్ ఫండ్ కంపెనీలు, ఫైనాన్స్ కంపెనీల అధికారులు, స్టాండింగ్ కౌన్సిళ్ల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ. 3.50 లక్షల పరిహారం

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా, బాధితులకు పరిహారం అందేవరకు అన్ని విధాల సహాయం అందిస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఈ సహాయక కేంద్రం తీసుకున్న చర్యల ఫలితంగా ఇటీవల 'హిట్ అండ్ రన్' ప్రమాదాల్లో తీవ్ర గాయాలైన గాజువాకకు చెందిన బడ్డి సరస్వతి, ఇందుకూరి అప్పలరాజు, దేవర నూకరాజు, పర్వీన్ బేగం, కొండ్రి కృష్ణమ్మ మరియు డాబాగార్డెన్స్ ప్రాంతానికి చెందిన పద్మనాభుని ఆండాలమ్మలకు ఒక్కొక్కరికీ రూ 50,000 చొప్పున మొత్తం రూ. 3.50 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు 69 మంది బాధితులకు మొత్తం రూ. 55.50 లక్షల పరిహారం అందజేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాద కేసుల్లో ఎవరికైనా సహాయం కావాలంటే రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రంలో గాని, లేదా టోల్ ఫ్రీ నంబర్ 7995095793కి గాని సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

మహారాణిపేట: అంతర్జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా మద్దిలపాలెంలోని ఆర్ఐవో కార్యాలయంలో విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన వారికి జిల్లా స్థాయి పోటీల్లో అవకాశం కల్పిస్తారు. విజేతలకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నివారణాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐవో పి.మురళీధరరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ ఉమామహేశ్వరరావు, జిల్లా సూపర్‌వైజర్ బద్రి, స్వచ్ఛంద సంస్థ మేనేజర్ రవి, సతీష్, వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

రుణాల వసూలుకు వేధించొద్దు

బీచ్‌రోడ్డు: వ్యక్తిగత రుణాల వసూలు కోసం వేధించడం సరికాదని ది లీగల్ సావీ డైరెక్టర్ మండా మానస అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రికవరీ ఏజెంట్ల హింసాత్మక ప్రవర్తన, మానసిక వేధింపులు తీవ్రంగా పెరిగాయన్నారు. నగరంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 2024లో రుణ వేధింపులపై పోలీసులకు వచ్చిన ఫిర్యాదులు 41 శాతం పెరిగాయని, కేసులు 35,944కు చేరాయని తెలిపారు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్ వంటి నగరాల్లో అధిక కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వ్యక్తిగత రుణాలపై డిఫాల్ట్‌లు గత ఆరు త్రైమాసికాల్లో అత్యధిక స్థాయికి చేరాయని పేర్కొన్నారు. 'ది లీగల్ సావీ' అనే సంస్థ 11 వేలకు పైగా రుణ గ్రహీతలకు రూ.270 కోట్ల విలువైన రుణ పరిష్కారాలను చట్టబద్ధంగా సమన్వయం చేసిందని తెలిపారు.

రెండు ఐవీఎఫ్ సెంటర్ల తనిఖీ


ఐవీఎఫ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: నగరంలోని పలు ఐవీఎఫ్ కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, ఇతర సరోగసీ బృందంతో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. సంతానోత్పత్తి కేంద్రాల్లోని ఆపరేషన్ థియేటర్లు, వార్డులు, స్కానింగ్ మిషన్లను పరిశీలించారు. నోవా ఐవీఎఫ్ కేంద్రం, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రాలను సందర్శించి, అక్కడి పరిస్థితుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డీఎంహెచ్‌వో ఆ కేంద్రాలకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రుల్లో ఏఆర్‌టీ కేంద్రాల నిర్వహణకు అనుమతులు ఉన్నాయా లేదా అని, వైద్యులు, ఇతర సిబ్బంది విద్యార్హతలను, ల్యాబ్ పరికరాలను పరిశీలించారు. ఈ తనిఖీ బృందంలో విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ గీతా వందన, కేజీహెచ్ రేడియాలజిస్ట్ డాక్టర్ రాధ, కేజీహెచ్ పాథాలజిస్ట్ డాక్టర్ టి. కిశోర్, కేజీహెచ్ సోషియాలజిస్ట్ డాక్టర్ శోభశ్రీ, సోషియాలజిస్ట్ ఎల్.వి. రమణి, ఎన్‌జీవో ప్రతినిధి కె. శివాజీ, మానిటరింగ్ కన్సల్టెంట్ డాక్టర్ బి. ఉమావతి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డీఎంఈవో) బి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.